# రాష్ట్రాభివృద్ధి ఘనత కేసీఆర్‌దే..

- తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బ తీసేలా కాంగ్రెస్ పాలన
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- హాజరైన నాయకులు, కార్యకర్తలు



పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 3: తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగాలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్ పట్టణంలోని హుడాకాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేండ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అభివృద్ధి చేయక పోవడంతో పాటు ఇచ్చిన హామీలను ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రాష్ట్రాన్ని తెచ్చి అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటుతోనే ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందిందని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, జిల్లా రైతు సమితి మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రాష్ట్ర సాధనలో బాపూజీ కీలకపాత్ర

పద్మశాలి భవన్‌లో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూన్ 3: తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కీలకపాత్ర వహించారని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్లస్వామి, మీడియా విభాగం జాతీయ అధ్యక్షుడు అవ్వారి భాస్కర్, చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు స్వామి అన్నారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్ వద్ద బాపూజీ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం 94 ఏండ్ల వయస్సులో దేశ రాజధాని ఢిల్లీలో బాపూజీ ఉద్యమం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తుచేశారు.

## గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యువల్ చేయాలి

హిమాయత్‌నగర్, జూన్ 3: రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 10 ఏండ్లుగా పనిచేస్తున్న 1654 మంది గెస్టు లెక్చరర్లను కళాశాలలు ప్రారంభమైన వెంట నే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి, ఇంటర్ బోర్డు అధికారుల కు ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు జె.మల్లేశ్, రాష్ట్ర క్యాదర్శి ఎ.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి 10 ఏండ్ల నుంచి ప్రభుత్వ కాలేజీల బలోపేతానికి కృషి చేస్తున్న అతిథి అధ్యాపకులను ఆటోరినివల్ చేయాలని కోరారు. జూన్ 1 నుంచే వర్తింప జేయాలని అన్నారు. తక్షణమే 3 నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

# వైభవంగా దశాబ్ది ఉత్సవాలు

- పలు ప్రాంతాల్లో జెండాలను ఎగురవేసిన ఎమ్మెల్యేలు
- పండ్ల పంపిణీ చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

బోరబండలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ, జెండా ఆవిష్కరణ నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్రనేత కె.విప్లవ్‌కుమార్, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి బంజారాహిల్స్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరకాలనీలో ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

**ఘనంగా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు**

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు సోమవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో జాతీయ పతాకావిష్కరణ చేసి, కింగ్‌కోఠిలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ నాయకులు జె.బాబుయాదవ్, కృష్ణయాదవ్, రఘు, సంపత్, సయ్యద్ బిన్ ఖార్వన్, కమల్, ఇక్బాల్ అత్తాస్ పాల్గొన్నారు.

**జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాగంటి..**

ఎర్రగడ్డ: బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పర్యటించి జాతీయ పతాకాలు, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బోరబండ సైట్-3లోని సర్కారు దవాఖానలో పలువురికి ఆయన పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, ఆనంద్, బాబూరావు, రమేశ్‌యాదవ్, దేవమణి, వెంకటేశ్, యూసుఫ్, వసంతరావు, ఏడీ మధు, సుధాకర్, మేరీ, అజయకుమారి, ఖలీల్, శంకర్‌నాయక్, సాయి, షాకీర్, రహమత్ పాల్గొన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో మాగంటితో కలిసి డివిజన్ అధ్యక్షుడు సంజీవ, జావిద్, బాలకృష్ణ, నర్సింగ్, కల్యాణి, చంద్రశేఖర్, రమణ, రజియా, యాదమ్మ, తరుణ్, దీపు, గంటకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోపీనాథ్..**

జూబ్లీహిల్స్: తెలంగాణ కోసం అమరులైన వారిని స్మరించుకోవడం అవసరమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని

కింగ్‌కోఠిలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న హేమలతయాదవ్

యూసుఫ్‌గూడలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్‌తో కలిసి పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు సంతోష్, నర్సింగ్‌దాస్, తలరి వెంకటేశ్, సంతోష్, హుస్సేన్, వేణుగోపాల్, సత్యనారాయణ, శ్రీనివాస్, శరత్, నాగరాజు, శైలేశ్, అమ్మాజీ, అరుణ, మాధవి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వెంగళరావునగర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎర్రగడ్డ శ్వాసకోశ వ్యాధుల హాస్పటల్‌లో పండ్లను పంచిపెట్టారు. కార్పొరేటర్ దేదీప్యరావు, విజయ్, అంబటి రామకృష్ణ, వేణుగోపాల్, కట్టలక్ష్మి, పాల్గొన్నారు.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్రనేత కె.విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

సైట్-3 సర్కారు దవాఖానలో పండ్లను అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3: కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ అన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన కాటేదాన్ క్లస్టర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడారు. కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్, సచిన్, ప్రవీణ్, దత్తు, శశికాంత్, బాల్‌రాజ్, గోపాల్, సయ్యద్ అలీ, నర్సింగ్‌రావు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు అరెస్ట్

### వివరాలు వెల్లడించిన సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్

నారాయణగూడ పీఎస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్

హిమాయత్‌నగర్, జూన్ 3: ద్విచక్ర వాహనాలు చోరీచేసి తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం నారాయణగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, డీఐ నాగార్జున, డీఎస్సై వెంకటేశ్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంబర్‌పేట, తిలక్‌నగర్‌లో ఉండే సైమాన్‌రాజ్ సామ్యూల్(23) పెయింటర్. రాంకోఠికి చెందిన మైనర్ (బైక్ మెకానిక్) స్నేహితులు ఇద్దరూ చోరీలు చేస్తుంటారు. సైమాన్‌రాజ్ సామ్యూల్ బైక్‌లను అపహరించడంలో దిట్ట. పలు కేసుల్లో జైలుకు వెళ్లాడు. విక్రంనగర్‌లో ఉండే అర్కపల్లి సిద్ధిరాజు ఇటివల తన ద్విచక్ర వాహనం ఇంటి ముందు పార్కు చేయగా ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టారు. రాంకోఠిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. గతంలో సామ్యూల్‌పై అబిడ్స్ పీఎస్‌లో ఒక కేసు, నారాయణగూడ పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. వారి వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని మైనర్‌ను జువెనల్ హోంకు, సామ్యూల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శంకర్ తెలిపారు.

## చిన్నారుల కుటుంబాలకు పరామర్శ

బాధితులతో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3: శిథిలావస్థకు చేరిన గోడకూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో ప్రమాదవశాత్తు గోడకూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం, మరో ముగ్గురు ఆసుపత్రి పాలుకావడం దారుణమన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలన్నారు.

**రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**

గోడకూలి మరణించిన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఒకొక్కరికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గాయాలకు గురైన చిన్నారులకు సైతం ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

## కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

జూబ్లీహిల్స్, జూన్ 3: నేడు జరుగనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ ఆదేశించారు. సోమవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని జూబ్లీహిల్స్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అయ్యాయని చెప్పారు. రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జూబ్లీహిల్స్ కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో జూబీహిల్స్ ఏఆర్వోలు దశరథ్ సింగ్ రాథోడ్, సేవా ఇస్లావత్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, ఈఈ రాజ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్‌కు వివరిస్తున్న అదనపు కలెక్టర్

## నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు

శంషాబాద్ రూరల్, జూన్ 3: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డు లో వాహనల తనిఖీలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. వాహనలకు సరైన పత్రాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఇన్సూరెన్స్‌తో పాటు లైసెన్స్, ఎయిర్‌పోర్టులో అనుమతి ఉన్న వాహనాలు మాత్రమే తీసుకురావాలని సూచించారు. తనిఖీల్లో సీఐ బాలరాజు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డులో వాహనలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ల్యాప్‌టాప్ అప్పగించిన పోలీసులు

బంజారాహిల్స్,జూన్ 3: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు వెతికి అప్పగించారు. చందానగర్‌కు చెందిన రమ్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆదివారం కుటుంబసభ్యులతో జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ గుడికి ఆటోలో వచ్చారు. ల్యాప్‌టాప్ మర్చిపోయి గుడిలోనికి వెళ్లారు. తర్వాత విషయం గుర్తుకురావడంతో జూబ్లీహిల్స్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన క్రైం పోలీసులు సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా ఆటోను గుర్తించారు. సోమవారం ఆటో డ్రైవర్ చిరునామా కనుక్కొని ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధితురాలు రమ్యను పీఎస్‌కు పిలిపించి అప్పగించారు. జూబ్లీహిల్స్ డీఐ మధుసూదన్, క్రైం సిబ్బంది శంకర్, వివేక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేస్తున్న జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు

## రోగులకు పండ్లు పంపిణీ

ఖైరతాబాద్, జూన్ 3: రాష్ట్ర ఆవిర్భావ ముంగింపు వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఖైరతాబాద్ బడా గణేశ్ చౌరస్తాలో జాతీయ, బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గజ్జెల ఆనంద్, అంజీ, దీపు, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

**ఆవిర్భావ ముగింపు వేడుకలు**

ఖైరతాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నేత, హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ కెప్ర సన్నరామ్మూర్తి సోమాజిగూడలోని బీఎస్‌మక్తాలో బీఆర్ఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్‌కే అహ్మద్, నాయకులు బాబయ్య, కలీం, అమ్జద్, ఆరీఫ్ పాల్గొన్నారు.

జెండాను ఎగురవేసిన ప్రసన్నరామ్మూర్తి

## మాట వినడం లేదని కత్తితో దాడి

బండ్లగూడ, జూన్ 3: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య తన మాట వినడం లేదని, కక్ష పెంచుకున్న ఓ డిఫెన్స్ ఉద్యోగి మామ, బావమరిదిపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎస్సై నాగరాజు వివరాల ప్రకారం.. చంద్రయణగుట్టలోని డీఎల్ఆర్ఎల్ కేంద్ర ప్రభుత్వ సంస్థలో లేట్ మిషన్ ఆపరేటర్‌గా అబ్దుల్లా(45) పని చేస్తున్నాడు. ఎంఎంపహాడీకి చెందిన ఫర్హానాబేగంను పెండ్లి చేసుకున్నాడు. అనంతరం వరకట్న వేధింపుల కేసులో 2018లో అబ్దుల్లా జైలుకెళ్లి వచ్చాడు. ఫర్హాన తల్లిదండ్రులు చెప్పిన మాటలు వింటూ భర్తకు, కుటుంబ విషయంలో సహకరించడం లేదు. దీంతో కక్ష పెంచుకున్న అబ్దుల్లా శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఎంఎంపహాడీలోని తన మామ సలీంఖాన్ ఇంట్లోకి ప్రవేశించాడు. మటన్ కట్‌చేసే కత్తితో మామ సలీంఖాన్, బావమరిది మాజీద్ ఖాన్‌పై విచక్షణరహితంగా దాడి చేశాడు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అబ్దుల్లాను స్థానికులు పట్టుకొని చితకబాదారు. పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పనిచేస్తున్న సంస్థకు టోకరా

బంజారాహిల్స్, జూన్ 3: పనిచేస్తున్న సంస్థను మోసగిస్తున్న ఉద్యోగిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. న్యూఢిల్లీకి చెందిన రోహిత్‌కుమార్ అత్తాపూర్ గుమ్మకొండకాలనీలో ఉంటున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నం-10లోని స్టార్ ఆస్పత్రిలో డిప్యుటీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడు. వ్యవహారం యాజమాన్యానికి తెలిసింది. దీంతో గతనెల 30 నుంచి డ్యూటీకీ రావడం లేదు. అతడి వద్ద సంస్థకు చెందిన ల్యాప్‌టాప్, ఫోన్ తదితర వస్తువులతో పాటు సంస్థకు చెందిన కీలకమైన డాటా ఉందన్నారు. సదరు డాటాను దుర్వినియోగం చేసే అవకాశం ఉందంటూ ఆస్పత్రి మెడికల్ సూపరెండెంట్ డాక్టర్ కళ్యాణచక్రవర్తి సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు రోహిత్‌పై ఐపీసీ 408, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సెల్‌ఫోన్ చోరీ.. నిందితుడి అరెస్టు

ముజాకీర్

ఎర్రగడ్డ, జూన్ 3: సెల్ ఫోన్ల చోరీకి పాల్పడుతున్న ఓ యువకుడిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. డీఐ భూపాల్‌గౌడ్ వివరాల ప్రకారం.. మోతీనగర్ పరిధి కల్యాణ్‌నగర్ వెంచర్-3 పార్కులో గతంలో ఫోన్ చోరీకి జరిగిందని ఫిర్యాదు చేశారు. కాగా ఎట్టకేలకు నిందితుడు మహ్మద్ ముజాకీర్‌ను సోమవారం పట్టుకొని అరె స్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా క్రైమ్ సిబ్బంది నవీన్, రాహుల్, కృష్ణ, రవిలను డీఐ అభినందించారు. అయితే ముజాకీర్‌పై సైబరాబాద్ పరిధి మా దాపూర్ పీఎస్‌లో గతంలో ఫోన్ చోరీ కేసు నమోదైందని చెప్పారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, జూన్ 3: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసంచేసిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. రోడ్ నం-12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉంటున్న యువతి (19) స్థానికంగా సూపర్ మార్కెంట్‌లో పనిచేస్తోంది. ఐదేండ్ల క్రితం మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన చరణ్ (19)తో పరిచయం ఏర్పడింది. అప్పట్లో మైనర్లు కావడంతో కుటుంబసభ్యులు కౌన్సిలింగ్ ఇచ్చి మేజర్లు అయ్యాక చూద్దామని నచ్చచెప్పారు. తర్వాత యువతి వెంటపడడంతో పాటు పెళ్లి చేసుకుంటానంటూ చరణ్ వేధిస్తున్నాడు. 18 ఏండ్ల తర్వాత చేసుకుందామని యువతి చెప్పడంతో అంగీకరించాడు. ఇటీవల విభేదాలు రావడంతో పెళ్లి చేసుకునేది లేదంటూ చరణ్ చెప్పడంతో యువతి సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను ఐదేం డ్ల పాటు పెళ్లి పేరుతో నమ్మించి ఇప్పుడు మోసం చేస్తున్నాడంటూ బాధితురాలి ఫిర్యాదుతో చరణ్ మీద ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.